# విత్తు

ఆకుమడిలో దమ్ముచేస్తోన్న చక్రయ్య ఒంటిమీంచి ఘర్మజలం ధారలుగా కారుతూ భూమిని అభిషేకిస్తోంది.

తపస్సు చేస్తున్న ఋషిలా దీక్షగా మడి తొక్కుతున్నాడు. ఎలాంటి ముద్దలూ రాళ్ళూ వుండకుండా మడి అంతా సమంగా వుండేలా చదును చేస్తున్నాడు.

ఎంతచక్కగా దమ్ముచేస్తే నాటిన విత్తనం మొలకెత్తడానికి అంత అనువుగా ఉంటుంది. వరిమొక్క పచ్చగా బలంగా ఉంటే ఎన్నో కంకుల్ని వేస్తుంది. ఆ కంకులకు కాసే గింజలే రైతుల బతుకు. కష్టం. ఫలం. భవిష్యత్తు. అన్నీను.

"ఏంటి మావా అప్పుడే దమ్ము చేసేస్తున్నావు విత్తనాలింకా మార్కెట్లోకి రాలేదు గదా" పశువుల్ని తోలుకెళ్తున్న ఇంకో రైతు అన్నాడు.

"ఇవాళో రేపో వస్తాయంట. నారాయణ చెప్పేడ్రా అబ్బాయ్. మళ్ళీ కాలవ కట్టేత్తే కస్టవని ముందుగానే దమ్ము సేసేత్తన్నా....."

"దాల్వాకి దెబ్బతిన్నావు. ఈ సారన్నా జాగర్తపడు మావా"

"భూవినీ ఆకాశాన్నీ నమ్ముకున్నోళ్ళం. ఆరుగాలం కస్టపట్టం తప్ప ఇంకేం సెయ్యగలంరా. ఆ దొంగనా కొడుకు నాసిరకం విత్తనాలు అంటగట్టాడు. మొలకెత్తనే లేదు. వూరాగా అన్యాయం అయిపోయాన్రా. అదను తప్పి పోతోందని నిన్నూ నిన్నూ బతిమాలి నాలుగు రకాలు తెచ్చి ఊడ్చాను. ప్చ్...... కస్టం దక్కలేదు. బాకీలు కొండలా పెరిగి పోయాయి........!"

చక్రయ్య స్వరం గాద్గదికమయ్యింది.

"అందరిపనీ అట్లాగే వుందిలే మావా. నువ్వు పైకి చెబుతున్నావు. మేం లోపలేడుస్తున్నాం. అంతే తేడా"

అతడెళ్ళిపోయాడు.

దమ్ము సంతృప్తికరంగా అయ్యింది. ఎంతో సంబరంగా అన్పించింది. మడిలోంచి

వచ్చి ప్రక్కనే వున్న చెరువులో కాళ్ళూ చేతులూ కడుక్కున్నాడు.

'విత్తనాలు కొనడానికి డబ్బు ఎక్కడ పుడుతుందా' అని ఆలోచిస్తూ ఇంటి ముఖం పట్టాడు.

పీట వాల్చి అన్నం వడ్డించి ఆ ప్రక్కనే చతికిలబడింది భార్య రత్తమ్మ.

అన్యమనస్కంగా తింటున్నాడు చక్రయ్య.

"శ్రావణంలో పిల్ల పెళ్లి చెయ్యాలి" మెల్లగా అంది.

"చూద్దాం లేవే"

"చూద్దాం చేద్దాం అంటే కాదు ఆలీసం సేత్తే బయటికెళ్లి పోయేట్టున్నాడు మా అన్నయ్య....."

"పోతే పోనివ్వే. కాలూ చెయ్యి కూడదీసుకోలేక నేను ఛస్తొంటే పిల్లా పెళ్ళీ నా శ్రాద్ధం అంటావేంటే ఎర్రిమొగమా!" కయ్యిమన్నాడు.

"ఉరుమురిమి మంగలం మీద పడ్డట్టు ఎవరి మీదో కోపం నా మీద సూపిత్తావేంటి?!"

"నాకు కోపం ఏంటే. పేదోడి కోపం పెదవికి సేటన్నారు. నాది కోపం కాదే బాధ. దుక్కం. విత్తనాలకి డబ్బు సర్దుబాటయ్యేలా లేదు. పుస్తెల తాడూ తాకట్టుకెళ్ళిపోయింది. ఏం సేయాలో ఎలా సావాలో తెలీటం లేదే"

"ఇంటి కప్పు కింద కూకొని అవేం మాటలు! నారు పోసినోడు నీరు పోయక పోడ్లే" కంచంలో మజ్జిగ పోస్తూ అంది.

"కాలం మునుపట్లా లేదే. సొసైటీ వుంటే ఏదో రకం తిరిగేది. దాన్ని దివాలా ఎత్తించేసేరు. బ్యాంకోళ్ళ చుట్టూ తిరిగి తిరిగి కాళ్ళనొప్పులు తెచ్చుకోడమేగాని అప్పు పుట్టదు. ఎలా బతకాలో ఏవో!" నిట్టూరుస్తూ లేచాడు.

భుజాన పైపంచె వేసుకొని రచ్చబండ దగ్గరికెళ్ళాడు. అప్పటికే పదిమందిదాకా చేరారు.

ఊరి మధ్య ఎప్పుడో యాభై ఏళ్ల క్రితం వేప చెట్టుకీ రావి చెట్టుకీ పెళ్లిచేసి చుట్టూ చప్టా కట్టారు. ఆ చెట్లు పెద్దవై నీడనిస్తున్నాయి. చప్టా బీటలు తీసి కొంత భాగం కృంగి పోయినా మొత్తానికి కూర్చోడానికి అనువుగానే వుంది.

అదే నలుగురూ కలిసి మంచీ చెడూ చెప్పుకోడానికి అనువైన రచ్చబండ

అయ్యింది.

" రా బాబాయ్. కూర్చో. రేపు విత్తనాలొస్తున్నాయంట. ఇంత క్రితమే డీలర్‌తో మాట్లాడాను. మనోళ్ళమంతా వెళ్తున్నాం మరి..." అన్నాడు నారాయణ.

అతడు యువకుడు. చదువుకున్నవాడు. ఊరితలలో నాలికలా ఉంటాడు.

"నేనూ వత్తాన్రా. దాల్వాకి దగా పడ్డాను. ఈపాలైనా అసలైన విత్తనాలు తెచ్చుకోవాలి" అన్నాడు చక్రయ్య.

"ఏది అసలు ఏది నకలు అన్నది దేవుడు కూడా కనిపెట్టలేడు. అంత పకడ్బందీగా ఉంటాయి సీళ్ళూ ముద్రలూ లేబుళ్ళూ. ఒక్క నల్లగొండ జిల్లాలోనే 5000 క్వింటాళ్ళ వరి విత్తనం మొలకెత్తలేదని ఆ జిల్లా కలెక్టరు చెప్పినట్లు పేపర్లో వార్త వచ్చింది"

"గవర్నమెంటోడే అలా సేతులెత్తేత్తే ఇంక మట్టి పిసుక్కునే మనమేం జెయ్యగలంరా అబ్బిగా" మరో రైతు చంద్రన్న అన్నాడు.

"వ్యవసాయ శాఖ వుంది. విత్తనాభివృద్ధి సంస్థ వుంది. కలెక్టరున్నారు. సెక్రటరీలున్నారు. మంత్రి వున్నారు. అయినా అదనుకి విత్తనాలు దొరకవు. ఎరువులు దొరకవు. ఏదోలా పండిస్తే ఫుడ్ కార్పోరేషన్ కొనదు. అయినకాడికి మిల్లర్లకి అమ్ముకోవాలి. అమ్మబోతే అడివి కొనబోతే కొరివిలా వుంది మన పరిస్థితి"

నారాయణ మాటల్తో ఏకీభవిస్తూ తలలూపారంతా.

"ఈ పాలొచ్చినప్పుడు మన మంత్రిగార్ని నిలదీయాలి" ఓ యువకుడన్నాడు.

నవ్వేడు నారాయణ. "ఆయన మనకింక కనపడడొరేయ్. యమ్మెల్యే కాకముందు బుల్లి కాంట్రాక్టరు. ఇప్పుడేకంగా 500 ఎకరాల ఆసామి.....!"

"ఎట్టెట్టా!" నోరెళ్ళ బెట్టారొకరు.

"అది కూడా అలాటిలాటి భూమి కాదు గిరిజనుల కొండ భూమి. అందులో బాక్సైటు ఖనిజం దండిగా వుందిట. అమాంతం వందల కోట్లకి అధిపతై పోయాడు"

"నీ మాటలు వింటోంటే వీళ్ళ ముందు మాయలఫకీరు బలాదూరు అన్పిస్తోందిరా నారాయణా!" చక్రయ్య అన్నాడు.

"బాగా చెప్పేవు. నాయకులకి జనమూ వారి బాగోగులూ కాదు కమీషన్లు కావాలి. నాసి విత్తనాలు నకిలీ విత్తనాలు బూడిద ఎరువులు పని చేయని పురుగు మందులు బహిరంగంగా అమ్మినా నోరెత్తరు. ప్రాజెక్టులంటూ పనులు మొదలెట్టకుండానే కోట్లు

విడుదల చేసేసి కమీషన్లు దండుకుంటారు. దళారులకీ గుత్తేదారులకీ ఇది స్వర్ణయుగం అనుకో"

"ఆళ్ళిలాపోతే మనకేం గాని ఏం విత్తనమైతే బావుంటాదంటావురా అబ్బాయ్" నారాయణని అడిగాడు చక్రయ్య.

"యం.టి.యు. 7029 గాని 3291 గాని కొందామనుకుంటున్నాం. మరేది దొరుకుద్దో రేపు చూడాలి"

ఆ రాత్రి వడ్డీ వ్యాపారి దగ్గర 'తల' తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నాడు చక్రయ్య. మర్నాడు ఊరోళ్ళతో బాటు టౌనుకెళ్లాడు.

అప్పటికే పరిసర గ్రామాల నుంచి చాలామంది రైతులొచ్చారు. వారికన్నా అధికసంఖ్యలో పోలీసులున్నారు.

"గంగి గోవుల్లాంటోళ్లం. నడ్డి విరిగినా నోర్మూసుక్కూర్చునే వాళ్ళం. మరింత మంది పోలీసులెందుకొచ్చినట్టురా నారాయణా"

"కొన్ని క్వింటాళ్ల విత్తనాలే అమ్ముతారు. మిగతావి బ్లాక్ చేస్తారు. దాంతో రైతులు రెచ్చిపోయి గడబిడ చెయ్యొచ్చు కదాని ముందే పోలీసుల్ని దింపేశారు"

"దాల్వాకి నాకు మొలకెత్తని విత్తనాలమ్మింది ఈ డీలరే కదా!"

"అందుకే వాడికి వత్తాసుగా వీళ్ళొచ్చారు. వాళ్ళు వీళ్ళూ పై వాళ్ళూ అంతా ఒక్క తాను గుడ్డలే. మనమే వెర్రి నాగన్నలం....!"

నుదురు కొట్టుకుంటూ క్యూలో నిలబడ్డాడు చక్రయ్య.

రైతు పాసు పుస్తకాలు చూచి అవసరమైన విత్తనాల్లో సగమే ఇచ్చారు. మిగతావి తర్వాతిస్తామన్నారు.

"విత్తనాలన్నీ ఒకే తూరి నాటకపోతే ఎలారా ఎనకా ముందైతే తేడా వొచ్చెయ్యదూ" ఆక్రోశపడ్డాడు చక్రయ్య.

"అవన్నీ వాళ్ళకి పట్టవుగానీ సొమ్ముంటే బ్లాకులో కొనుక్కో" ఎవరో అన్నారు.

మరి గత్యంతరం లేక అధిక ధర చెల్లించి విత్తనాలు కొనుక్కొచ్చి నాన బెట్టాడు. మొలకెత్తగానే తీసుకెళ్ళి ఆకుమడిలో చల్లాడు.

చకచకా ఎదుగుతోన్న వరి మొక్కల్ని చూసి "హమ్మయ్య! ఈసారి మోసపోలేదు" అని ధైర్యం చెప్పుకున్నాడు చక్రయ్య.

భూదేవి పచ్చని కోక కట్టుకుంది. మురిసిపోయాడు. ఆకుమడిలో కల తిరిగాడు. ప్రతి మొక్కనీ పరిశీలనగా చూశాడు. పురుగు పట్టలేదు. అక్కడక్కడా వున్న కలుపు మొక్కల్ని పీకిపారేశాడు.

"దేవుడు దయదలిస్తే ఈ సార్వాకి ఒడ్డున పడిపోతాను" అనుకుంటూ గట్టు మీద చతికిలబడ్డాడు. మట్టిని చేతుల్లోకి తీసుకొని ఆప్యాయంగా ఆఘ్రాణించాడు.

అతడి చేయి తాకిడికి భూమి పులకించింది. అదే సమయంలో భూమి స్పర్శకి రైతు ఒడలు పులకరించింది. ఒకరి వల్ల ఒకరు ఒకరితో ఒకరు......ఆ బంధం సంబంధం అనుబంధం అపురూపం!

ఊళ్ళోకి మంత్రిగారొస్తున్నారనీ రచ్చబండ దగ్గర మీటింగుకి అంతా రావాలనీ చాటింపు వేశారు.

సదరు మంత్రివర్యులు స్థానిక ఎమ్మెల్యే కూడా అవడంతో ఊరంతా కదలి వెళ్ళింది.

రచ్చబండ మీద వేసిన కుర్చీల్లో మంత్రిగారు, ఆర్డీవో, ఏదో కంపెనీ ప్రతినిధులో ఇద్దరు కూర్చున్నారు.

"మీ అందరికీ గొప్ప శుభవార్త చెబుదామని స్వయంగా నేనే వచ్చాను. మీ ఊరు మీ బతుకులు అన్నీ మారిపోబోతున్నాయి. మీరంతా లక్షాధికార్లయిపోతారు. పంచెలు పోయి ఫాంట్లు చెప్పులు పోయి బూట్లు వస్తాయి. మీకూ మీ పిల్లలకీ బొచ్చెడు ఉజ్జోగాలొచ్చిపడతాయి. ఇక ఎండకి ఎండక్కర్లేదు. వానకీ నానక్కర్లేదు. కాలుమీద కాలేసుకుని కూర్చోవచ్చు. ఒకటో తారీక్కి ఠంచనుగా జీతం వచ్చి చేతిలో పడుతుంది. మీ బాగు కోరడం మీ ప్రతినిధిగా నా బాధ్యత నా ధర్మం.....!"

మంత్రి ఆగి అనుచరుల వంక విసుగ్గా చూశారు. వాళ్ళు "తప్పట్లు తప్పట్లు" అంటూ తప్పట్లు కొట్టి ఈలలు వేశారు. అతిభక్తితో కొందరు డ్యాన్సులూ చేశారు.

"మీ అభిమానాన్ని మర్చిపోలేను. మరిగంటే మీకు నష్టపరిహారంగా లక్షలివ్వడానికి థర్మల్ కంపెనీ వాళ్ళు డబ్బు సంచుల్తో వచ్చారు. మనవంతా కూర్చొని ఎంత పుచ్చుకోవాలన్నది డిసైడ్ చేద్దాం......"

"ఇదంతా ఎందుకో ఏవిటో చెప్పలేదు మంత్రిగారూ" నారాయణ అరిచాడు.

"అదోటుంది కదూ. మరిచేపోయా. సంగతేంటంటే ఈ కంపెనీ వాళ్ళు మీ

ఊళ్ళో థర్మల్ విద్యుత్ ప్లాంట్ పెడుతున్నారు. పక్కనే సముద్రం వుంది కదా ఇక్కడైతే బావుంటుందని నేనే చెప్పేను. మన ప్రియతమ ముఖ్యమంత్రి గారు ఈ ప్రాంతాన్ని ప్రత్యేక ఆర్థిక మండలంగా ప్రకటించి వెయ్యి ఎకరాల భూమిని వీరికి కేటాయించేశారు......"

జనంలో కలకలం మొదలైంది. "మేం ఒప్పుకోం" "మా భూములు అమ్మం" అంటూ కేకలు పెట్టారు రైతులు.

సెక్యూరిటీ సిబ్బంది అలర్టై తుపాకులు రెడీగా పట్టుకుని మంత్రి గారి చుట్టూ పహారా కాయసాగారు.

"ఉన్నపళాన పొమ్మంటే ఎవరికైనా బాధగా వుంటుంది. కాదన్ను. కానీ కాళీ చెయ్యక తప్పదు. ఇక్కడ థర్మల్ కంపెనీ పెడితే బోల్డంత విద్యుత్తు తయారవుతుంది. దానితో ఏసీలు పెట్టించుకోవచ్చు. ఫ్యాక్టరీలు కట్టుకోవచ్చు....."

మంత్రిగారి మాటలు పూర్తి చేయకుండానే అరుపుల్తో కేకల్తో దూసుకొచ్చారు జనం.

"మేం బతకడానికి నీరు కావాలి గాని నిప్పు అక్కర్లేదు" అరిచాడో రైతు.

"అన్నిరకాల అనుమతులొచ్చేశాయి. ఎవరూ దాన్ని ఆపలేరు. అంచేత ఎకరానికి ఎంత రేటు కావాలో చెప్పండి. బంగారంలాంటి ఈ అవకాశాన్ని చేజార్చుకోవద్దు...." స్వరం పెంచారు మంత్రిగారు.

"బతకడానికి ఒప్పించాలిగాని సావడానికి ఒప్పించాలని సూత్తావేంటయ్యా. అసల్నువ్వేం మనిసివి. భూమి నుంచి వేరైన మొక్క బతుకుద్దేంటి. మేమూ అంతే" మంత్రి వైపు వెళ్తూ అన్నాడు చక్రయ్య.

అతడ్ని ఆపి దూరంగా లాక్కుపోయారు మంత్రిగారి మరియు కంపెనీ వారి మనుషులు.

"మాకు మీరిచ్చే బిచ్చాలు అక్కర్లేదు. ఈ నేల మాది. దుక్కి దున్ని రాజనాలు పండించి లోకానికి అన్నం పెట్టడమే మాకు తెలుసు. మమ్మల్నిలా బతకనీండి. కూలీలుగా భిక్షగాళ్ళుగా దిగజార్చకండి" చేతులు జోడించి అర్థించాడు నారాయణ.

అతడికి వత్తాసుగా నిలిచింది ఊరు.

"పాయింటు అర్థం చేసుకోకుండా మాట్లాడతావేంటి....."

ఆయన మాటలకు అడ్డొచ్చి "మేం భూముల్ని అమ్మం మొర్రో అంటావుంటే కంపెనీవోడు కొంటాడంటూ వాళ్ళని ఎనకేసుకొస్తావేంట్రా తార్పుడు నా కొడకా!" రగిలిపోయాడో రైతు.

మంత్రిగార్ని ఆర్డీవోని ఖాతరు చేసే స్థితిలో లేరు రైతులు. పరిస్థితి వేడెక్కుతోందని అర్థమైంది.

"మీ చావు మీరు చావండి. ఈ ప్రాజెక్టు ఆగదు. మీ శవాల మీంచి నడిచెళ్ళి అయినా శంఖుస్థాపన చేస్తాను....."

తన స్థితి స్థాయి ఇంగితం బాధ్యత అన్నీ మరచి మంత్రిగారు సవాలు విసిరారు. గ్రామస్తుల గుండె గాయం చేసి దానిమీద గొడ్డుకారం చల్లేసరికి ఆగ్రహంతో మండారు. చేతులూ కర్రలూ లేచాయి.

హడావిడిగా మంత్రిగారిని తీసుకుపోయి కారెక్కించారు అంగరక్షకులు.

దుమ్ము రేపుకుంటూ కార్లెళ్ళిపోయాయి.

ఊరు విషాదసంద్రమయ్యింది.

"మనూరి మీద నాయకుల కన్ను పడింది. ఇక కబ్జా అయిపోయినట్టే. బంగారుపళ్లెంలో పెట్టుకునెళ్ళి ప్రైవేటు పారిశ్రామికవేత్తల చేతుల్లో పెట్టేస్తారు. వాళ్ళు విద్యుత్ ఉత్పత్తి చేసి ఇష్టమొచ్చిన రేటుకి అమ్ముకుంటారు. కుబేరులవుతారు. ప్రాజెక్టులోంచొచ్చే బూడిదని కూడా ఒబ్బిడి చేయరు. మన ఆరోగ్యాలు నాశనం అవుతాయి. మనం కూలీలమైపోతాం. ప్రాజెక్టులోంచి వచ్చే వేడి నీరు సముద్రాన్ని కలుషితం చేస్తుంది. చేపలు చచ్చిపోతాయి. మత్స్యకారుల నోట్లో ఇక మన్నే. మిన్నకుంటే మనల్ని పాతాళంలోకి అణగదొక్కేస్తారు" అన్నాడు నారాయణ ఉద్రేకంతో ఊగిపోతూ.

అలా జరక్కూడదు. జరగనివ్వం- అన్నారంతా ముక్తకంఠంతో.

అయినా అందర్లో గుబులే. దిగులే. భయమే. ఆందోళనే.

బ్రిటీషోళ్ళని గాంధీగారు ఎలాంటి ఆయుధం లేకుండా తరిమేసిన మాట నిజమే. కాని ఈ పాలకులు నిరసనలకీ ధర్నాలకీ సత్యాగ్రహాలకీ లొంగివస్తారా?

నిద్రపట్టక దొర్లుతున్నాడు చక్రయ్య.

భవిష్యత్తు గుహలాంటి నోరు తెరిచి వికట్టాటహాసం చేస్తున్న రాక్షసిలా వుంది.

తనని మింగేస్తుందా? నామరూపాల్లేకుండా చేస్తుందా? రైతు అనేవాడు లేని

రాజ్యం రాబోతోందా?

కలత నిద్రపోయాడు. నిద్రలో కలగన్నాడు.

భీకరంగా అరుస్తోంది ఓ ప్రక్కనున్న ఫ్యాక్టరీ. చుట్టూ కనుచూపుమేర వరకూ ఉన్న పొలాల్లోని మట్టినంతా తిరగబెట్టేశారు. ఎటు చూసినా మట్టి రాశులే! బూడిద కుప్పలే!

పొలాల్లో ఒకచోట దిష్టిబొమ్మ పెట్టారు. దగ్గరికెళ్లి చూశాడు. అది తనే!

తుళ్ళిపడి లేచాడు. దు:ఖం వెల్లువెత్తింది.

"ఎందుకలా నీలో నువ్వు కుళ్ళిపోతావు. ఏం జరిగితే అదే జరుగుద్ది. నలుగుర్తో బాటే మనపూనూ!" భార్య అంది.

"ఏమోనే. పెళ్ళికెదిగిన పిల్ల వుంది. ఇస్కూల్లో సదూతున్న కొడుకున్నాడు. నోటి కాడ కూడు లాగేసుకుంటే ఎలా బతుకుతామే? అప్పెలా తీరుద్దే?"

"ఎకరానికి లక్షల రూపాయలిస్తరంటగా!"

"భూమిమాలచ్మి ముందు ఆ లచ్చలెంతే పిచ్చిదానా. అటు నుంచి ఇటు తిరిగే సరికి ఆవిరై పోద్ది. భూమి అయితే ఎప్పటికీ పడి వుంటాది. భూమిని నమ్ముకుంటేనే బతుకుంటాదే. అమ్ముకుంటే బతుకు పోతుందే పిచ్చిదానా!"

"నిజంగానే మన భూముల్ని లాగేసుకుంటారంటావా? వాళ్లకేం పోయే కాలమొచ్చింది. మన నోట్లో మన్నుపోసి వాళ్ళేం బావుకుంటారు!"

"ఏ విత్తనం నాటితే ఆ మొక్కే మొలుత్తాదే. వీళ్ళు సోర్థాన్ని విత్తుతున్నారే. లాభాల పంట కోసుకోడానికి గోతికాడి నక్కల్లా కాచుక్కూచున్నారే" ఆవేదనగా అన్నాడు.

రత్తమ్మ గుండెలు భయంతో బరువెక్కాయి.

కారు చీకట్లో సన్నని కాంతిరేఖ కన్పించగా అతి కష్టం మీద నోరు తెరిచి అంది "ఇంటికో ఉజ్జోగం ఇత్తారంటగా"

"ఇత్తారో సత్తారో ఎవుడికి తెలుసు. ఏరుదాటే దాకా ఏరుమల్లన్న, ఏరు దాటేక బోడి మల్లన్న. సదువూ సంధ్యాలేని నాలాటోళ్ళ కిచ్చేది కూలిపనే కదటే. ఏం చేస్తావని ఎవరైనా అడిగితే ఎవసాయదారులవండీ అని గొప్పగా సెప్పుకునే వోడ్ని. ఇంకిప్పుడు......." ఏడ్చేశాడు.

"ఊరుకోవయ్యా. ఆడదాన్లా ఆ ఏడుపేంటి....." ఓ ప్రక్క తనూ కన్నీరు కారుస్తూ

ఊరడించింది రత్తమ్మ.

మర్నాడు ఊళ్ళోకి చాలామంది యువతీ యువకులూ పెద్దవాళ్ళూ ల్లీడర్లూ వచ్చారు. 'పర్యావరణ పరిరక్షణ సంఘ సభ్యులమని చెప్పుకున్నారు. థర్మల్ విద్యుత్ ప్లాంట్ వల్ల గాలి, నీరు, భూమి, వాతావరణం ఎంతగానో కలుషితమవుతాయన్నారు. రైతులకూ పల్లెకారులకూ అథరువు పోతుందన్నారు. కరపత్రాలు పంచి 'మీకు అండగా మేమున్నాం' అన్నారు.

ఎంతో సంబరపడ్డాడు చక్రయ్య. వాళ్లవెంట ఇంటింటికీ తిరిగాడు.

"మొత్తం ఈ ప్రాంతంలో 1000 ఎకరాల భూమిని కట్టబెట్టారు. ఇదంతా బీడు భూమి అనీ పోరంబోకు భూమి అనీ ఏమీ పండదనీ చెప్పి ప్రాజెక్టుకి పర్మిషన్ తెచ్చుకున్నారు" చెప్పిందో ల్లీడరమ్మ ఆవేశంగా.

"ఇదేం మాటండి. మేం పన్నులు కడుతున్నాం. నీటి తీరువాయి కడుతున్నాం ఇది పండే పచ్చని భూమో కాదో సర్కారోడికీ తెలీదూ?" నిలదీశాడు చక్రయ్య.

"అదో గుడ్డి ప్రభుత్వం. సంబంధిత అధికారులకి లంచాలిచ్చి అలా రాయించేసుకున్నారు. పత్రికలూ టీవీలూ యథార్థం ఇదీ అని చెబుతున్నా కళ్ళు విప్పి చూట్టం లేదు. ఇలా మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చుంటే కాదు. మనమంతా ఉద్యమించాలి. రేపటి బహిరంగ సభలో పాల్గొని మన వ్యతిరేకతని బలంగా చాటి చెప్పాలి"

'చేస్తాం' 'చేస్తాం' అంటూ నినదించారంతా.

మర్నాటి సభకి చక్రయ్య వెళ్ళబోతోంటే, "ఏవైనా గొడవులవుతాయేమో, నువ్వెళ్ళకపోతే ఏంటి" అడ్డు పడింది రత్తమ్మ.

"అంతా నాకెందుకనుకుంటే మనల్ని బతకనివ్వరే. సూత్తన్నావుగా. మన బతుకు మనల్ని బతకనియ్యడం లేదు. రేపు మన అన్నం మనల్ని తిననీరు. మనగాలి మనల్ని పీల్చనీరు. ఆళ్ల చేతుల్లో తోలుబొమ్మలమై ఆడమంటారే. థూ! ఆ వెధవ బతుకెందుకే. ఒక గింజ విత్తి వంద గింజలు పండించే రైతునే. మొక్కకి ఊపిరి పోయడం మనిసికి అన్నం పెట్టడం తెలిసినోడ్నే. చంపడం కాదు చావడమే తెలిసి నోడ్నే!"

"అయేం మాటలూ! పైన తథాస్తు దేవతలుంటారు.....!" లబలబలాడింది రత్తమ్మ.

"నేనొక్కడ్నే కాదే. చుట్టుప్రక్కలి రైతులు పల్లోళ్ళు అంతా వత్తారే..... దెబ్బకి సర్కారోడు దిగిరావాల!"

"నేనూ వస్తాను" ఒక నిశ్చయానికొచ్చి అంది.

భార్య వంక నమ్మలేనట్లు చూశాడు. ఎన్నడూ వీధి మొఖం చూసెరగని ఆడది ఇవాళ కొంగుబిగించి వీధిన పడతానంటోంది!

"నా పిల్లలు వాళ్ళ పిల్లలు బాగుండాలి. బతకడానికి నేలుండాలి. ఈ పవర్లూ ప్లాంట్లూ మనకి వద్దే వద్దు.....!"

ఆమె కళ్ళల్లోని బతుకు భయాన్ని తెగింపు ఆక్రమించింది!

ఆమె సంకల్పానికి అభినందన పూర్వకంగా చూశాడు.

"చావో బతుకో తేల్చుకుందాం పద" అంటూ ముందడుగు వేశాడు చక్రయ్య. రత్తమ్మ అనుసరించింది.

రైతురామ పాద స్పర్శకి పులకరించి భూమి సిరుల పంటలు కురిపిస్తుందో లేక పాలకుల తూటాల ఆగ్రహానికి చిందిన రైతు నెత్తుటి ధారలకు పంట చేలు ఎర్రబడతాయో కాలమే చెప్పాలి!

కాని, విపత్తు విత్తబడింది. ఫలం అనూహ్యం కాదు!

(నవ్య వారపత్రిక 19.10.2011)